హారర్ స్టోరీ

# ఆత్మార్పణ




నేను, మా ఆవిడ మా ఇద్దరు పిల్లలతో మాది చింతలేని కుటుంబం. ఉద్యోగ రీత్యా హైదరాబాదు నుండి ట్రాన్స్‌ఫరయి ఈ ఊరికి వచ్చాం. ఈ ఊరు ఒరిస్సా ప్రాంతానికి అతి దగ్గరగా ఉంది.

మా ఇంటికి అరఫర్లాంగు దూరంలో పాడుబడిన ఓ పార్కుంది. పేరుకది పార్కయినా చిన్నసైజు అడవిలా ఉంటుంది. ఇష్టానుసారంగా పెరిగిన పచ్చగడ్డి, దుబ్బుగా పెరిగిన పొదలు, నాచుపట్టిన అక్కడి చెరువునూ చూడగానే, ఎవరూ దానిని సంరక్షించడం లేదని తెలుస్తుంది. అయినా మరో గత్యంతరంలేక సెలవు దినాల్లోను, ఆదివారాల్లోనూ మేమంతా అక్కడికే షికారుకి వెళ్ళేవాళ్ళం! ట్రాన్స్‌ఫరయి ఈ ఊరికి రాకున్నా, ఆ పార్కుకి దగ్గరగా మా ఇల్లులేకున్నా, మేము ఆ పార్కుకి వెళ్ళకున్నా ఉంటే క్షుద్రశక్తులపట్ల, క్షుద్రదేవతోపాసకుల పట్ల నా అభిప్రాయాలు వేరుగా ఉండేవి. ఒకప్పుడు వాటన్నిటినీ 'నాన్సెన్స్' అనేవాణ్ని. కాని, ఈనాడు వాటిని నమ్మవలసి వస్తోంది. క్షుద్రశక్తులకోసం, క్షుద్రదేవతోపాసకులు ఎందకయినా తెగించగలరని నా అనుభవం చెప్తోంది.

నెలరోజుల క్రితం ఓ ఆదివారం సాయంత్రం, పిల్లల్ని, భార్యని వెంటేసుకుని ఆ పార్కుకి వెళ్ళాను. చిన్నగా జల్లుకురుస్తోంది. పిల్లలిద్దరూ గడ్డిలో ఆడుకొంటున్నారు. నేను, మా ఆవిడ దగ్గర దగ్గరగా కూర్చొని కబుర్లాడుకొంటున్నాం. ఇంకెవరూ లేరక్కడ! మేం నలుగురం మాత్రమే ఉన్నాం.

పావు గంట గడిచింది.

తర్వాత పార్కుకి వెనకవేపుగా ఉన్న తుప్పుపట్టి, గజాలూడొచ్చిన తలుపుల్ని తోసుకొంటూ వాళ్ళిద్దరూ వచ్చారు. అరవైయ్యేళ్ళ ముసలాయన్ని-వీల్‌చైర్లో కూర్చొబెట్టి, అతనికి గొడుగుపట్టి! సన్నగా ఉన్నవ్యక్తి, ఆ కుర్చీని తోసుకొంటూ పార్కులోనికి ప్రవేశించాడు. ముసలాయన చుట్టూ శాలువా కప్పి ఉంది. అతను లుంగీ మీద ఉన్నాడు. అతని కళ్ళకి నల్లకళ్ళద్దాలున్నాయి. సన్నగా ఉన్న వ్యక్తిచేతిలో ఓ ప్లాస్టిక్ బుట్టఉంది. దక్షిణ దిక్కుగాకూర్చొబెట్టాడు ముసలాయన్ని. సన్నగా ఉన్నవ్యక్తి. చలికి వణికిపోతూ, ముసలాయన పెదవులతో ఏదో ఉచ్చరించాడు కాసేపు. అతనికి దంతాలు లేనట్టున్నాయి. అందువల్ల అతని మాటలు పాము బుసల్లా వినవచ్చాయి మాకు. కొద్దిసేపు గడిచింది. ఇంతలో ఎక్కణ్నుంచి వచ్చాయోయేమో పది, పన్నెండు గెద్దలు వచ్చి, వాళ్ళకి దగ్గరగా వాలాయి. అవి మామూలు గెద్దల్లాలేవు. రాక్షస గెదల్లా ఉన్నాయి. బలంగా ఉండి, ఒకొక్కటీ ఒక్కో పసిపిల్లాణ్ని తన్నుకుపోగలిగినట్టున్నాయి. వాళ్ళిద్దరి చుట్టూ అలంగం తిరగసాగాయవి. సన్నగా ఉన్నవ్యక్తి, ప్లాస్టిక్ బుట్టనుండి ఏవో ముక్కల్లాంటివి తీసి వాటికి ఆహారంగా విసిరాడు. ఆ ముక్కలు కిందపడక, గాలిలో ఉంటూండగానే-వాటిని అందుకొనేందుకు పోటీపడాయి గెద్దలు. తన్నుకుపోయాయి. అయిదునిముషాలు పాటు ఆ తతంగం జరిగింది.

మా పిల్లలు అదంతా చూస్తూ, ఆనందంగా చప్పట్లు చరిచారు. నాకు, నా భార్యకి కూడ ఆ దృశ్యం కాస్తంత వినోదాన్ని కలిగించిన మాట వాస్తవం! చీకటిపడిన తర్వాత ఆ వ్యక్తులిద్దరూ వెళ్ళిపోయారు. మేమూ ఇంటి ముఖం పట్టాం.

మరో ఆదివారం నాడు—

మేము అక్కడ ఉంటూండగా, తుప్పుపట్టి గజాలూడొచ్చిన తలుపుల్ని తోసుకొంటూ వాళ్ళు కూడ వచ్చారు. ఈసారి సన్ననివ్యక్తి చేతుల్లో గొడుగు, ఓ ప్లాస్టిక్ బుట్టాఉన్నాయి. యథాప్రకారం, దక్షిణ దిక్కుగా కూర్చొని, ముసలాయన ఏదేదో ఉచ్చరించాడు. కొద్దిసేపట్లో గెద్దలువచ్చి వాలాయి. సన్నని వ్యక్తి వాటికి ఆహారంగా ముక్కల్ని వెదజల్లాడు. వాటినవి తిని ఎగిరిపోయాయి. పిల్లలు చప్పట్లు చరుస్తూ, ముసలాయన దగ్గరికి వెళ్ళజూస్తుంటే, వద్దని వారిస్తూ మా ఆవిడ వాళ్ళవెంటపడింది. అయినా

**ఇది నిజం**

గన్నెస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ అనే పుస్తకం స్వయంగా ఓ విషయంలో ప్రపంచ రికార్డు సృష్టించింది. బ్రిటిష్ పబ్లిక్ లైబ్రరీలలో నుంచి తరుచూ దొంగిలింపబడే పుస్తకం అదే.

# కంథ

పిల్లలువినలేదు. ముసలాయన్ని చెరి, అతన్ని ఎన్నెన్నో ప్రశ్నలువేసి అల్లరిచేశారు. సమాధానంగా ముసలాయన నవ్వాడేతప్ప. మాట్లాడలేదు. పిల్లల తరఫున మా ఆవిడ అతనికి క్షమాపణ చెప్పింది.

సన్నగా వర్షం ప్రారంభమయింది. సన్నని వ్యక్తి దగ్గరగా లేకపోవడంతో, వీల్‌చైర్‌ను తోసుకొంటూ, నీడపట్టుకు రాబోని, చైర్‌స్లిప్ కావడంతో ముసలాయన కిందపడ్డాడు. ఆ పతనంలో అతని లుంగీ ఎగిరింది. అప్పుడుచూశాం! అతనికి ఓ కాలులేదు. అందువల్లనే అతను వీల్‌చైర్‌ను ఉపయోగిస్తున్నాడని అర్థమయింది. జాలేసింది అతనిపట్ల. సాయంచేసేందుకు నేను వెళ్ళమంటే, రావద్దని హెచ్చరించి, సన్నని వ్యక్తి ముసలాయన్ని ఎత్తి కుర్చీలో కూర్చోబెట్టి తీసుకువెళ్ళిపోయాడు.

మళ్ళీ మరో ఆదివారం–

మేమంతా అక్కడ ఉన్నాం. మా అందరిలోనూ నిరీక్షణ! పిల్లలిద్దరూ ఆడుకోక వాళ్ళ కోసమే ఎదురుచూస్తున్నారు. వాళ్ళొస్తే గెద్దలొస్తాయి. గెద్దలొస్తే సరదాగా ఉంటుందని, అప్పటి వరకు సరదారాదని పిల్లల ఉద్దేశ్యం. మా ఆవిడకూడ వాళ్ళొచ్చే దిశవైపే ఆసక్తిగా చూస్తోంది. ఆమెకు వికలాంగులంటే ఆపేక్ష ఎక్కువ! ఆరోజు వానలేదు. చలిగాలి వీస్తోంది. వాళ్ళొచ్చారు, సన్నని వ్యక్తి ముసలాయన్ని దక్షిణ దిక్కుగా కూర్చోబెట్టాడు. ముసలాయన ఏదేదో ఉచ్చరించాడు. నాలిక అతని పెదాల్ని తడిచేసింది. గెద్దలొచ్చాయి. ప్లాస్టిక్ బుట్టలోని వాటిని, వాటికి ఎరవేశాడు సన్ననివ్యక్తి. ఇంకా వేస్తూనేఉన్నాడు. మాపిల్లలు తాము వేస్తామంటూ అల్లరి చేస్తున్నారు సన్ననివ్యక్తిని. అతను ఇవ్వజూపడంలేదు. వాళ్ళు అతన్ని ఆటపట్టిస్తున్నారు. చొరవగా ప్లాస్టిక్ బుట్టలోని వాటిని తీయబూస్తున్నారు. అతను వారిస్తున్నాడు. వాళ్లు వినడంలేదు. అతను కోపగించుకున్నాడు. వాళ్ళని కసిరికొట్టాడు. ఏడుస్తున్నారు వాళ్ళు. మా ఆవిడ సర్దిచెప్పేందుకు వెళ్ళింది. ఎల్లల్ని రమ్మంటే రామని మొరాయిస్తున్నారు. వాళ్ళూ ఆ ప్లాస్టిక్ బుట్టలోని వాటిని గెద్దలకి వేస్తామని మంకుపట్టు పట్టారు. చేసేదిలేక :

"పోనీ అవేవో పిల్లలకి కొన్ని ఇవ్వండి. వాళ్ళూ ఆడుకొన్నట్టుగా ఉంటుంది. మీకు కొంత శ్రమతప్పుతుంది." అంది మా ఆవిడ, సన్నని వ్యక్తితో. అతను మారుపలకలేదు. అర్థింపుగా అతనిదరిచేరనుంది మా ఆవిడ.

"రావద్దు! రావద్దు" అని కేకలేసి హెచ్చరించాడు సన్ననివ్యక్తి. అర్థంకాలేదామెకి. ఎందుకిలా అతను వెర్రెత్తిపోతున్నాడు. అతను ప్లాస్టిక్ బుట్టను వెనక్కి వెనక్కి దాచుకొన్నాడు. అందులోని వాటిని గెద్దలకి వేయడం మానుకొన్నాడు. అయితే గెద్దలు పూరుకొనలేదు. అతనిపై ధాడిచేసి, బుట్టలోని వాటిని ఒక్కతన్నుగా ఎత్తుకుపోయాయి. ఆ హఠాత్ సంఘటనకి సన్నని వ్యక్తితూలి, ముసలాయన మీద పడ్డాడు. వీల్‌చైర్ బేలన్స్ తప్పింది. ముసలాయన కిందపడ్డాడు. అతని కళ్ళద్దాలు ఎగిరి దూరంగాపడ్డాయి. గాలి రివ్వున వీచింది. ముసలాయనకు కప్పిఉంచిన లుంగీ, శాలువా పూర్తిగా ఎగిరిపోయాయి.

అప్పుడు చూసిన దృశ్యానికి మేమంతా "కెవ్వున" అరవాల్సి వచ్చింది. పిల్లలయితే ఏడ్చి, పరుగెత్తుకు వచ్చి నన్ను చుట్టుముట్టారు. మా ఆవిడ స్పృహ తప్పింది.

ముసలాయనకి రెండు కాళ్ళూలేవు, రెండు కళ్ళూలేవు, రెండు చేతులూ లేవు. అతని ఉత్తి మొండెం నేలమీద దొర్లుతోంది. రసికారుతోంది. క్షణంలో సగంలో సన్ననివ్యక్తిలేచినిల్చున్నాడు. గబగబా శాలువాను, లుంగీని అతనిపై కప్పాడు. అతన్ని కుర్చీలో కూలవేసి తీసుకుపోయాడు మమ్మల్ని తీక్షణంగా చూస్తూ. ఆ రాత్రి భయపడవద్దని ధైర్యం చెప్పడంతో పిల్లలు నిద్రపోయారు. నాకయితే కంటిమీదికికునుకురాలేదు. ఎంతసేపూ ఆ మొండెమే గుర్తుకురావస్తోంది. దాని వెనకున్న మిస్టరీ ఏమిటన్నది మాత్రం తెలియలేదు. నా ప్రక్కనే మా ఆవిడ పడుకొని ఉంది. నిద్రలో ఏదేదో కలవరిస్తోంది. భయంకర దృశ్యాన్ని చూసిందికదా, తప్పదిది అనుకొన్నాను. కాని, హఠాత్తుగా ఆమె లేచి చాలా రభస చేస్తుందనుకోలేదు. పెద్దగా కేకవేసి లేచిందామె. కళ్ళని గుండ్రంగా తిప్పి, నాలుకను బయటికితీసి భయంకరంగా ప్రవర్తించింది. ఫోం బెడ్‌లో వేళ్ళని జొనిపి, వాడిగాఉన్న గోళ్ళతో బెడ్‌ను ముక్కలు ముక్కలుచేసి విసరసాగింది. నాకంతా అయోమయనిపించింది. ప్రక్కనున్న పిల్లలు జడుసుకొంటారనిపించింది. వాళ్ళు ఈ గొడవను చూడరాదని, బలంగా ఆమెను పొదివి పట్టుకొన్నాను. అరవకుండా ఆమె గొంతు మూశాను. అయిదు నిముషాల తర్వాత మనిషయిందామె. నీరసంగా నా కళ్ళల్లోనికి చూసి, నిద్రపోయింది. ఆ రాత్రేకాదు, మర్నాడు, ఆ మర్నాడు కూడా అలాగే ప్రవర్తించిందామె. డాక్టర్లకి చూపించాను. వాళ్ళకెవరికీ ఆమె రోగమేమిటన్నది అంతుచిక్కలేదు. చివరికి ఆమెను హైదరాబాదులోని సైకియాట్రిస్ట్ దగ్గరకి తీసుకువెళ్ళక తప్పదనిపించింది. జరిగిన సంఘటనను ఎవరికీ చెప్పదలచలేదు. కాని, బాధనణుచుకోలేక, ఓదార్పుకోసం మంచివాడు, బాగా పరిచయమయిన మా నౌకరికి మాత్రం తెలియజేసి, సంగతేమిటని అడిగాను. వాడు చెప్పాడప్పుడు.

వాళ్ళిద్దరూ క్షుద్రదేవతోపాసకులట! ముసలాయన గురువు, సన్ననివ్యక్తి శిష్యుడు. అరవైయ్యేళ్ళ తర్వాత క్షుద్రదేవతోపాసకులు జీవించి ఉండకూడదు. ఆత్మార్పణ చేసుకోవాలి! ఆత్మార్పణలో అనేక రకాలు ఉన్నాయి. అందులో ఖండఖండాలుగా అంగాంగాన్నీ కోసుకోని, గెద్దలకి తనని తానుగా సమర్పించుకోవడమన్నది ఒకటి! అతనలా పూర్తిగా గెద్దలకి ఆహారమయి చనిపోతే, అతని విద్యలన్నీ శిష్యుడికి సంక్రమిస్తాయి.

వొళ్లు గగుర్పొడిచింది ఆ మాటలకి. నోట మాటరాలేదునాకు. క్షణం అచేతనుణ్ణయ్యాను. తర్వాత తీక్షణంగా ఆలోచించాను-రానున్న ఆదివారం నాడు జరగనున్న సంఘటనను గూర్చి.

ఆదివారం వచ్చింది. మనసును ఆపుకోలేక పార్కుకి బయల్దేరాను. ఈసారి పిల్లల్ని, మా ఆవిణ్ని వెంటబెట్టుకు రాలేదు. నేనొక్కణ్ణే వచ్చాను.

పార్కుకు వెనుక వేపుగాఉన్న తుప్పపట్టి, గజాలూడొచ్చిన తలుపుల్ని తోసుకుంటూ సన్నని వ్యక్తి ప్రవేశించాడు. అతని ఓచేతిలో గొడుగు.మరో చేతినున్న ప్లాస్టిక్ బుట్ట నిండుగా ఉంది. వీల్‌చైర్ లేదు. ముసలాయనా లేడు.

